క్లుప్తంగా

సీఆర్‌పీఎఫ్ బలగాలతో కవాతు



రామవరప్పాడు: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు నుంచి రామవరప్పాడు వరకు జాతీయ రహదారిపై శుక్రవారం పటమట పోలీస్‌స్టేషన్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు డీసీపీ అదిరాజ్‌సింగ్ రాణా పర్యవేక్షణలో సెంట్రల్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ భాస్కర్‌రావు నేతృత్వంలో శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం కవాతును నిర్వహించారు. ఎటువంటి అవాంఛిత సంఘటనలు చోటు చేసుకోకుండా మేమున్నామన్న భరోసా ప్రజలకు కల్పిస్తూ ఫ్లాగ్ మార్చ్ జరిగింది. పటమట సీఐ మోహన్‌రెడ్డి, ఎస్‌ఐలు వల్లి పద్మ, దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరు: సార్వత్రిక ఎన్నికల చర్యల్లో భాగంగా ఆత్కూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయుధ పోలీసు బలగాలు కవాతు నిర్వహించారు. ట్రైనీ డీఎస్పీ శ్రీవేద నేతృత్వంలో పారా మిలటరీ దళాలు కవాతు చేపట్టారు. కవాతులో ఆత్కూరు పోలీసులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు అన్నదానం

పెనమలూరు: పోరంకి గ్రామంలో అనాథ బాలలకు శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రభునగర్‌లో ఉన్న నవరత్నం అనాథ ఆశ్రమంలో పిల్లలకు మహాశివరాత్రి సందర్భంగా తాడిగడప గ్రీన్ సిటీ డెవలప్‌మెంట్ కమిటీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించింది. మానవసేవే మాధవ సేవగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని కమిటీ అధ్యక్షుడు అయినపురపు శేషగిరిరావు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, ట్రెజరర్ టి.సాయినాథ్, కమిటీ సభ్యులు రవి, కె.వెంకట్రావు, అన్నాబత్తుల సురేష్, ఎండీ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖాజీల పదవీకాలం పెంపు హర్షణీయం

కంకిపాడు: ప్రభుత్వ ఖాజీల పదవీకాలం పెంపుదల చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడం హర్షణీయమని కంకిపాడు మండల ప్రభుత్వ ఖాజీ హఫీజ్ మహమ్మద్ ఆరిఫ్ అన్నారు. గోసాల సెంటరులోని ఆయన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కడపలో జరిగిన ప్రభుత్వ ఖాజీల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాషా చేతుల మీదుగా ఖాజీల పదవీకాలం పదేళ్లకు పెంపుదల చేస్తూ జారీ చేసిన జీఓ ఎంఎస్ 36 ప్రతులను అందుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జీవో ప్రకారం 2031 వరకూ తాము పదవిలో కొనసాగుతామని ఆనందం వ్యక్తం చేశారు.

సీఎం జగన్‌ను తిరిగి గెలిపించుకోవాలి



పెనమలూరు: రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి గెలిపించుకోవాలని తాడిగడప మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్ అన్నారు. కానూరు సనత్‌నగర్‌లో శుక్రవారం జరిగిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లిం మైనార్టీలతో పాటు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు అండగా నిలిచారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు. ప్రధానంగా మహిళలు, విద్యార్థులు, రైతులకు జగనన్న పాలనలో ఎంతో మేలు జరిగిందని అన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగనన్నను తిరిగి గెలిపించుకుని సంక్షేమ పాలన కొనసాగించే విధంగా అన్ని వర్గాల వారు ఏకతాటిపైకి రావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వేమూరి బాలకృష్ణ, ఖాదర్, సుబ్బరాజు, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

గన్నవరం: స్థానిక ఎస్సీ కాలనీలోని తల్లి వెల్ఫేర్ వృద్ధాశ్రమంలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన జయలక్ష్మమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు జయభరత్ వృద్ధులకు అన్నదానం చేశారు. అనంతరం వృద్ధులకు నిత్యావసర సరుకులు, చీరలు పంపిణీ చేశారు. తల్లి వెల్ఫేర్ అసోసియేషన్ ఛైర్మన్ ఆర్.రూతమ్మ మాట్లాడుతూ తమ ఆశ్రమం ద్వారా వృద్ధులకు ఉచిత భోజనం, వసతి సదుపాయలను కల్పిస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

యనమలకుదురులో ఘనంగా శివోత్సవం

- శివగిరిపై ఉత్సవ శోభ
- కనుల పండువగా స్వామివారి కల్యాణం
- ఆకట్టుకున్న ప్రభోత్సవం.. పోటెత్తిన భక్తులు



యనమలకుదురులో శ్రీరామలింగేశ్వరస్వామి



యనమలకుదురు ఆలయంలో క్యూలైన్‌లో భక్తులు



పూజలు చేస్తున్న మంత్రి జోగి రమేష్



దర్శనానికి వచ్చిన ఎంపీ మోపిదేవి వెంకటరమణ



రామవరప్పాడులో రామలింగేశ్వరస్వామికి అన్నాభిషేకం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. భక్తుల సందడితో శివగిరిపై ఉత్సవ శోభ ఏర్పడింది. భక్తులు శుక్రవారం వేకువజామునే కొండపై వేంచేసి ఉన్న స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. కృష్ణానదిలో పుణ్య స్నానాలు చేసి, పితృదేవతలకు పిండ ప్రదానం చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయంలో స్వామివారికి విశేషంగా అభిషేకం చేశారు. స్వామివారికి బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. భక్తుల కోసం చలువ పందిళ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఉచితంగా ప్రసాదం, మజ్జిగ, తాగునీరు అందజేశారు. వృద్ధులు, వికలాంగులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించారు. మధ్యాహ్నం మొక్కులు తీర్చుకోవడానికి భక్తులు తలపై గండ దీపం పెట్టుకుని నేలపై చీరలు పరిచి కొండ చుట్టూ ప్రదక్షణలు చేసి, అనంతరం కొండపైకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారిని మంత్రి జోగి రమేష్, ఎంపీ మోపిదేవి వెంకటరమణ, విజయవాడ తూర్పు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కృష్ణబాబు, తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు వంటి పలువురు ప్రముఖులు, ఉన్నతాధికారులు దర్శించుకున్నారు. ప్రిన్సిపల్ కార్యదర్శి కృష్ణబాబు కొండపై భక్తుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సందడిగా ప్రభోత్సవం..

మహాశివరాత్రి సందర్భంగా గ్రామంలో నిర్వహించిన ప్రభోత్సవం ఆకట్టుకుంది. సాయంత్రం ఆరు గంటలకు రాతిచక్రాల రథంపై ఏర్పాటు చేసిన దేవుడి ప్రభను కొండ చుట్టూ తిప్పారు. గ్రామంలో దాదాపు 50 ప్రభలను రంగురంగు కాగితాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. దేవుడి ప్రభతో పాటు గ్రామంలో మిగితా ప్రభలు కూడా డప్పులు కొడుతూ, డీజేలతో ఊరేగించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ కోలాటం, కోయ నృత్యాలు, భేతాళ వేశాలు, భజనలు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసి భక్తులను ఉత్సాహపరిచారు. గ్రామంలో ప్రభలు రాత్రి పొద్దుపోయే వరకు తిరిగాయి.

కనుల పండువగా స్వామివారి కల్యాణం..

శ్రీరామలింగేశ్వర స్వామివారి దివ్య కల్యాణం అర్ధ రాత్రి 2.25 గంటలకు కనుల పండువగా జరిగింది. గ్రామంలోని మండపంలో అర్ధరాత్రి రావి ఉదయ్ కిరణ్, దీప్తి పుణ్య దంపతులతో ఆలయ ప్రధాన అర్చకుడు రామలింగేశ్వరసాగర్ స్వామివారి కల్యాణం ఘనంగా చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. నేడు గ్రామంలో గ్రామోత్సవం జరుపుతారు.

గన్నవరం రూరల్: మండలంలోని గ్రామాల్లో శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ముస్తాబాద కొండపై ఉన్న భ్రమరాంబ సమేత రామలింగేశ్వరస్వామి గుహాలయంలో స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. సంగీత సంకీర్తన, భక్తి రంజని, కోలాటం ఆకట్టుకున్నాయి. చిక్కవరం కొండపై ఉన్న బ్రహ్మయ్య లింగేశ్వరస్వామి ఆలయంలో శివలింగాన్ని భక్తులు దర్శించారు. సర్పంచ్ అన్నే లక్ష్మణరావు ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. భక్తులకు పలు చోట్ల అన్నసమారాధనలు చేశారు.

మంత్రి జోగి రమేష్ ప్రత్యేక పూజలు

పెనమలూరు: పెనమలూరు హైస్కూల్ సెంటర్ చెరువు కట్టపై ఉన్న త్రిమూర్తుల ఆలయంలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కేడీసీసీబీ ఛైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, పార్టీ నేతలు, భక్తులు పాల్గొన్నారు. పెదపులిపాక గ్రామంలో కృష్ణానదిలో పుణ్య స్నానాలకు భక్తులు పోటెత్తారు. వేకువజామునే భక్తులు నది వద్దకు వచ్చి స్నానాలు ఆచరించారు. చోడవరం గ్రామంలో కూడా భక్తులు నదీ స్నానాలు చేసి గ్రామంలోని శివాలయంలో పూజలు చేశారు. పెనమలూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీభీమేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివార్లను విశేషంగా అలంకరించారు. పెదపులిపాక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవిజయరాజరాజేశ్వరి, శ్రీ విజయసుందరేశ్వర స్వామివారి ఆలయంలో శివరాత్రిని శ్రీవాసుదేవానందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో చేశారు. కానూరు, తాడిగడప, పోరంకి శివాలయాల్లో మహాశివరాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణంలోని శ్రీజగదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో భోళా శంకరుడికి విశేష పూజలు జరిపించి శివనామస్మరణ చేశారు. పెద ఓగిరాల, కాటూరు, ముదునూరు శివాలయాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రజలు తోట్లవల్లూరు మండలం ఐలూరు ఏటిపాయకువెళ్లి స్నానమాచరించి పితృదేవతలకు పిండ ప్రదానం చేశారు. ఆర్టీసీ అధికారులు ఐలూరుకు ప్రత్యేక బస్సు సర్వీసులు నిర్వహించారు.

విజయవాడరూరల్: నున్న గ్రామంలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రం చినకంచి శివాలయంలో మహాశివరాత్రి సందర్భంగా భక్తులు విశేషంగా అభిషేకాలు చేశారు.



దేవుడి ప్రభ ఊరేగింపు

రాత్రి ఏడు గంటలకు శివపార్వతుల కల్యాణ మహోత్సవం జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దేవదాయశాఖకు చెందిన గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. శ్రీఅన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు కన్నుల పండువగా జరిగాయి. సీతారామపురం గ్రామంలోని శివాయంలో కూడా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

పేరంటాలమ్మ ఆలయంలో..

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలోని ఉప ఆలయమైన శ్రీ గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి అన్నాభిషేకంతో పాటు పలు అభిషేకాలు, పూజలను భక్తిశ్రద్ధలతో చేశారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో శాంతి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. దాతలు ఘంటా రామ్మోహనరావు, గంగాభవానీల సహకారంతో ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ బోయిన భానుప్రదీప్, కార్యదర్శి పి.లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని అన్ని శైవక్షేత్రాల్లో శుక్రవారం వేకువజాము నుంచే విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కంకిపాడు, ఈడుపుగల్లు, ప్రొద్దుటూరు, మద్దూరు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్ ధ్యాన మందిర్‌లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ముక్తేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం పెరికీడులోని ముక్తికాంత సమేత ముక్తేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత శనీశ్వరుడికి తైలాభిషేకం చేశారు. అనంతరం ముక్తేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శాంతి కల్యాణం వేదమంత్రోర్చణల మధ్య వైభవోపేతంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు నండూరు సత్యవెంకటేశ్వరశర్మ, నక్కా బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శ్రీకాశీవిశాలక్షి అన్నపూర్ణ సహిత విశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శాంతి కల్యాణం జరిపారు. తొలుత అఖండ దీపప్రజ్వలన, రుద్రాభిషేకం, పంచామృతాలతో అభిషేకాలు, లక్ష పుష్పార్చన నిర్వహించారు. సాయంత్రం వేదపండితుల మంత్రోర్చనలతో ఆదిదంపతులకు శాంతి కల్యాణం జరిగింది. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు. దావాజిగూడెంలోని శ్రీభ్రమారాంబిక సమేత మల్లికార్జునస్వామి, శ్రీవల్లిదేవసేన సుబ్రమణ్యస్వామి ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి కల్యాణం, లింగోద్భవ కాలంలో ఏకాదశ మహారుద్రాభిషేకం చేశారు. అలాగే కేసరపల్లిలో శ్రీసోమలింగేశ్వరస్వామి ఆలయం, గుమ్మడి క్షేత్రంలోని శివాలయంలో రుద్రాభిషేకాలు నిర్వహించారు.

మద్దూరు ఏటిపాయకు పోటెత్తిన భక్తజనం..

మండలంలోని మద్దూరు గ్రామ పరిధిలోని కృష్ణానది ఏటిపాయకు భక్తులు పోటెత్తారు. శివరాత్రి సందర్భంగా ఏటిపాయలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దీంతో ప్రజల సౌకర్యార్థం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నీరు కలుషితం కాకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా ప్రత్యేక సదుపాయాలను ఏర్పాటు చేశారు. పుణ్యస్నానాలు ఆచరించిన ప్రజలు పితృదేవతలకు పిండ ప్రదానాలు చేశారు. అనంతరం ఏటి ఒడ్డున ఉన్న శివాలయంలో పూజలు చేశారు. ఏటిపాయకు వచ్చిన ఓ వ్యక్తి స్వల్ప అస్వస్థతకు గురికావడంతో అక్కడే ఉన్న వైద్య సిబ్బంది సకాలంలో స్పందించి వైద్య సేవలు అందించారు. ఏటిపాయలో పుణ్యస్నానాలు సజావుగా సాగేలా సర్పంచ్ చిప్పల రామదాసు, పంచాయతీ పాలకవర్గం, సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు.



యనమలకుదురు మహోత్సవాల్లో వివిధ వేషదారణల్లో కళాకారులు



ముస్తాబాద ఆలయంలో కోలాటం



విద్యుత్ కాంతులతో ఈడుపుగల్లు శివాలయం



మద్దూరు ఏటిపాయలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



గన్నవరంలో ఆదిదంపతులకు కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



పెదపులిపాకలో నదీ స్నానాలు చేస్తున్న భక్తులు



యనమలకుదురులో స్వామివారి దర్శనానికి వేచిఉన్న భక్తులు

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఏఎంసీ చైర్‌పర్సన్ కరుణను సత్కరిస్తున్న ప్రతినిధులు

గన్నవరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. స్థానిక రామ్‌నగర్ కల్యాణ మండపంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్‌పర్సన్ తోట కరుణ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పి.వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు అన్నవరపు ఎలిజబెత్ రాణి, కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ వడ్లమూడి సరోజిని, పలువురు సర్పంచ్‌లను సత్కరించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య, ఉపాధ్యక్షుడు రాచేటి మురళీ, పలువురు మహిళా విభాగం నేతలు పాల్గొన్నారు. గుడ్‌మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జెడ్పీటీసీతో పాటు సర్పంచ్ నిడమర్తి సౌజన్య, హెచ్‌ఎంలు రవీంద్రభవాని, శైలజరాజరాజేశ్వరిని సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చిప్పాడ చంద్రశేఖర్‌రావు, దేవరపల్లి విక్టర్‌బాబు, పీడీ ధనియాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. స్థానిక ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో భారతీయ విద్యాభవన్ ప్రిన్సిపాల్, మాజీ సర్పంచ్ కేతినీడి ఫణీకుమారి, విశ్వకవి హైస్కూల్ ప్రిన్సిపాల్ అనితలను ఘనంగా సత్కరించారు. మానవత రాష్ట్ర కన్వీనర్ ఎం.కోటేశ్వరరావు, హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బాచారి, క్లోపల్లి నారాయణరావు, సీనియర్ సభ్యులు వడ్డి రాజేశ్వరరావు, కొట్నాని రామచంద్రరావు, పీవీఎస్ చలం పాల్గొన్నారు.



మానవత సంస్థ ఆధ్వర్యంలో సత్కారం

రామవరప్పాడు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 150 మంది మహిళలు, వృద్ధులకు జననీ థెరిస్సా సేవా సంస్థ ఆధ్వర్యంలో చీరలు అందజేశారు. సంస్థ అధ్యక్షురాలు బీ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ గత 21 ఏళ్లుగా సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భక్తులను రంజింపజేసిన భజన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహా శివరాత్రి పురస్కరించుకుని అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై కాటూరు గ్రామానికి చెందిన శ్రీ ఈశ్వరి భక్త సమాజానికి చెందిన కళాకారుల భజన భక్తులను రంజింపజేసింది. శుక్రవారం కళావేదికపై భక్త సమాజం గురువు గుమ్మడిదల వీర వెంకటేశ్వరరావు, మహేశ్వరి తమ శిష్యబృందంతో పలు అమ్మవారి కీర్తనలను ఆలపించారు.



జగనన్న పాలనలో అన్ని వర్గాలు సంతృప్తి

గన్నవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పట్ల అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి రామిశెట్టి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా విభాగం సమావేశం శుక్రవారం జరిగింది. రామిశెట్టి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయంలో సోషల్ మీడియా విభాగం కీలకంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలు నిత్యం ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. వీటిని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సమర్థవంతంగా తిప్పికొట్టాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, జేసీఎస్ కన్వీనర్లు కైలే శివకుమార్, వింత ఆదినారాయణ రెడ్డి, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ మెండే సుధాకర్, కో-కన్వీనర్ నరేష్, మండల కన్వీనర్లు పల్లి వీరయ్య, పెనుమాక రాజేష్, విజయ్‌రామ్, నవీన్, కోటేశ్వరరావు, తమలం సునీల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అఖండ నాదార్చన

విజయవాడ కల్చరల్: స్వరఝరి ఆధ్వర్యాన మహాశివరాత్రి సందర్భంగా గవర్నర్‌పేటలోని సీతారామ చంద్రమూర్తి దేవస్థానంలో శుక్రవారం నిర్వహించిన అఖండ నాదార్చాన అత్యంత వైభవంగా సాగింది. నగరానికి చెందిన సంగీత విద్వాంసులు అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్, లంక తేజస్వి, మల్లాది కార్తీక త్రివేణి, సాయి చరణ్ రాజ్, శారద ముష్టి భక్తి సంకీర్తనలను గానం చేశారు.

పాస్‌పోర్ట్ పోయినది

నా పేరు చీలి దాసు, కాటూరు, ఉయ్యూరు మండలం. మేము కాటూరు నుండి ఉయ్యూరులోని హౌస్‌కి షిఫ్ట్ అయ్యే సమయంలో పాస్‌పోర్ట్ పోయినది. ఎంత వెదకిననూ కనిపించలేదు. పాస్ పోర్ట్ నెం. X 6164859. దయచేసి ఎవరికైనా దొరికినయెడల అందజేయగలరు. ఫోన్ : 91822 32794

మోకాళ్ల నొప్పులకు ఆక్యుపంక్చర్ సరైన వైద్యం



కానూరులో ఉచిత వైద్యం శిబిరం

పెనమలూరు: మోకాళ్ల నొప్పులకు ఆక్యుపంక్చర్ సరైన వైద్యమని యోగాశక్తి సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ మాకాల సత్యనారాయణ అన్నారు. కానూరు అశోక్‌నగర్‌లో మహాశివరాత్రి సందర్భంగా ఉచితంగా మోకాళ్ల నొప్పులకు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఆయన మాట్లాడుతూ ఆక్యుపంక్చర్ వైద్యంతో ఎటువంటి ఆపరేషన్, మందులు లేకుండా మోకాళ్ల నొప్పులు తగ్గించవచ్చని తెలిపారు. మోకాళ్ల నొప్పులు తగ్గడానికి యుబీ 40 అనే నాడీ కేంద్రం వద్ద ఒత్తిడి చేయడం వలన నొప్పులు తగ్గించగలుగుతామని వివరించారు. ప్రతీ ఒక్కరు ఆక్యుపంక్చర్‌పై అవగాహన పొందితే ఆరోగ్య సమస్యలు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. శిబిరంలో 50 మందికి ఉచిత వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆలవాల రవి, విజయ్‌సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.